# పరివర్తన

రచన:
శ్రీ జె. ఎల్. నరసింహారావు

సాయంత్రం 6 గంటలవుతున్నది. నేను నామిత్రుడు శ్రీరామ్ యింటిబయటవున్న లాన్‌లో కూర్చొని చార్లెస్ డికెన్స్‌నవల 'ఎ టేల్ ఆఫ్ టుసిటీస్' గురించి చర్చించుకుంటున్నాము. ఇంతలో నాపదేళ్ళ చెల్లాయి చంద్రకిరణ్ స్కిప్పింగ్ తాడు వూపుకుంటూ పరిగెత్తుకొచ్చి 'అన్నయ్యా, ఏమీతోచటంలేదు. ఏదైనా కథ చెప్పవూ!' గారాబంగా అడుగుతూ నావొడిలో కూర్చుంది. రసవత్తరంగా సాగుతున్న, మాసాహితీ చర్చలోపానకంలో పుడకలా ప్రవేశించిన చెల్లాయిపై నాకు ఎంతయినాకోపంవచ్చింది. నాలోని కోపం అనే ప్రేరణ ప్రతీకారరూపం పొందేలోగా 'రావ్, సాహిత్యమెక్కడికిపోతుంది! మనమెక్కడికిపోతాం? ముందు చెల్లాయి ముచ్చటతీర్చు.' అని శ్రీరామ్ చంద్రకిరణ్ కోరికను సమర్థించటంతో నాకు కథచెప్పక తప్పింది గాదు.

+ + +

సాయంత్రం నాలుగుగంట లవుతోంది. రామాపురంలో హైస్కూలువిడిచిపెట్టారు. పిల్లలంతా కోలాహలంచేస్తూ బయటకువస్తున్నారు. 7 వ తరగతి చదువుతున్న, రామాపురం జమీందారుగారబ్బాయి రాము తనకన్న, క్రిందితరగతి పిల్లలపై సిరాచల్లుతూ వారిని కొడుతూ వినోదిస్తున్నాడు. మేష్టార్లందరూ జమీందారుగారి ఆశ్రితులవటంతో రాముచెప్పినట్లు నడచుకునేవారు. ఒకవేళ అలా చెయ్యకపోతే పాపం యీటీచర్లకి ఆ వూరిలో మంచినీళ్ళుకూడా పుట్టవుమరి. రాముని చూడగానే అందరూ సాధ్యమైనంతదూరంగా తప్పుకుంటున్నారు. కాని స్కూల్లో కొత్తగాచేరిన మీనా మాత్రం సిరామరకలతో అసహ్యంగా తయారయిన తన గౌను చూసుకుని ఏడుస్తూ రాముని సమీపించింది.

'ఎందుకన్నయ్యా, నామీద సిరాచల్లావు? నాకువున్నది యిదొక్కటేగౌను మీనాన్నకయితే బోలెడు డబ్బుంది. కనుక నీకు మంచి మంచి బట్టలుకొంటారు మా నాన్నయితే రిటైర్డు పోస్టుమాన్ నాకువున్న యీ ఒక్కగౌను మాసిపోతే రేపుస్కూలుకి ఏం తొడుక్కురాను?' అని మీనా వెక్కివెక్కి ఏడుస్తోంది.

'అన్నయ్యా' అన్న, మధురమైన పిలుపు రాముహృదయంలో అట్టడుగునపడివున్న, ప్రేమాభిమానాల్ని, బయటికితీసింది.

తనుచేసినపనికి రామూ చాలాబాధపడ్డాడు. పుట్టినప్పటినుంచి తండ్రిప్రేమ తప్పమరేమీ ఎరుగని మాతృహీనుడైన రాము యిన్నాళ్ళకి తన యీడుచెల్లాయి దొరికినందుకు చాలా సంతోషించాడు.

'పాపా, యీరోజునుంచి మనిద్దరం వొకజట్టు చక్కగా కలిసి ఆడుకుందాంవస్తావా?' అని అడిగాడు రాము, రాములో తను వూహించని యీ మార్పుకి చాలా ఆశ్చర్యపడింది మీనా?

'ఈరోజునుంచి ఎవ్వరిని ఏడిపించకుండా బుద్ధిగా పాఠాలుచదువుకుంటే నేనీజట్టువుంటాను.' అనిబింకంగా జవాబిచ్చింది మీనా.

సరే చెల్లీ యీరోజునుంచి అల్లరిమానేసి చక్కగా చదువుకుంటాను. సరేనా!' అంటూ రాముబుద్ధిగా లెంపలేసుకున్నాడు.

'అన్నయ్యా' 'చెల్లీ' అనుకుంటూ మీనా, రామూ చెట్టాపట్టాలువేసుకుని ఆటలకి పరిగెత్తారు.

అల్లరి రామునిబుద్ధిమంతునిగా మార్చినమీనాని టీచర్లందరూ మనసారా మెచ్చుకున్నారు.

రామూ, మీనాకలిసి ఆడుకుంటుండగా, రాముని యింటికితీసికెళ్ళేందుకు జమీందారుగారి అద్దాలగుర్రపుబండివచ్చి బడిముందు ఆగింది.

'వెళ్ళొస్తానుచెల్లీ' అంటూ రాముబండెక్కాడు. అద్దాలగుర్రపుబండి కనుమరుగయ్యేంతవరకు చూసిమీనా యింటికి దోవపట్టింది. నడుస్తూ సిరామరకలతో నిండి అసహ్యంగా తయారయిన తనగౌను వంకచూసుకుంది. 'ఈరోజు రాత్రి బాగా చిరిగిపోయిన గౌనుతొడుక్కుని యీగౌనువుతికి ఆరవేయాలి. అప్పటికి మరకలు పూర్తిగాపోవుగా... గౌను పాడయితే పాడయింది. తనకి మంచి అన్నయ్యదొరికాడు. అంతేచాలు.' ఈభావనరాగానే గౌను విషయంమర్చిపోయి యింటికేసి త్వరగా నడకసాగించింది మీనా.

మీనారాముల ఆటలపాటలు చూసి టీచర్లందరూ ముచ్చటపడసాగారు. ఈవిషయాలన్నీ జమీందారుగారి




చెవినిబడ్డాయి. జమీందారుగారికి తనపుత్రుడు రాము కూటికిగతిలేని పిల్లతో 'చెల్లీ' అంటూ చనువుగావుండటం సుతరాముగిట్టలేదు. ఆయన రాముకి యీవిషయంలో నయానాభయానా చెప్పిచూశారు. కానిలాభం లేకపోయింది. రామూ, మీనాల అనుబంధం రోజురోజుకీ మరింతగట్టి పడుతుండగా కొద్దికాలంగడిచింది ఆ సంవత్సరం దీపావళి వేడుకలు బాగా జరిగాయి. పండుగతర్వాత యధాప్రకారం స్కూలుకెళ్ళిన మీనాకి రాముకనిపించలేదు. రాము లేకపోవటంతో మీనాకి ఏమీతోచక పాఠాలు కూడా వినకుండా దిక్కులుచూస్తూకూర్చుంది. తర్వాతవరుసగా మూడు రోజులుగడిచినా రాము బడికిపోవటంతో మీనాయిక వుండలేక ధైర్యంచేసి రామువిషయం పిలకమేష్టారిని అడిగింది.

'అరే! నీకు తెలీదా పాపా? రాముకి దీపావళినాడు టపాసులుకాలుస్తుంటే టపాకాయచేతిలో ప్రేలిగాయాలు తగిలి జ్వరమువచ్చింది. నువ్వువెళ్ళి చూసిరామ్మా.' ఆప్యాయంగా అన్నారు పిలకమేష్టారు. తన అన్నయ్యరామూకి అనారోగ్యం అనగానే మీనాకి తన కాళ్ళక్రిందనున్న భూమి కంపిస్తున్నట్లుగా తోచింది. తనకికూడా రామూని చూడాలనేవుంది. కానీ జమీందారుచూస్తే...'అమ్మో' అంటూ భయంతో కళ్ళుమూసుకుంది. ఆరోజంతా క్లాసులో ముళ్ళమీదకూర్చున్నట్లు కూర్చుంది మీనా సాయంత్రం యింటికెళ్ళిన మీనా రామునిచూడాలా, వద్దా అన్నసందేహంలోపడింది. చిట్టచివరికి రామునిచూసేందుకు నిశ్చయించింది. తనకిష్టమైనదేవుడు కృష్ణునికి పూజచేసి ప్రసాదంతీసుకుని జమీందారుగారింటికి బయలుదేరింది మీనా గేటుదగ్గర ఘూర్కావీళ్ళప్రక్కగుడిసెనే వుండేవాడు కనుక అతనికి మీనా, రామూల అన్యోన్యత బాగా తెలుసు. అందువల్ల మీనాలోనికి-పోతూంటే చూడనట్టు నటించాడు. మేడపైకివెళ్ళిన మీనాకి, రాముగదిలోంచి 'చెల్లీమీనా,' అన్న రాముకలవరింతలు, 'ఆ గతిలేని దాని పేరెత్తావంటే హంటర్‌తో చర్మం వొలుస్తాను.' అన్న, జమీందారుగారి కేకలు, 'ఇంక రామూకి మందులుపనిచెయ్యవు. అతను కలవరిస్తున్న పాపవస్తేనేగానీ తెలివిరాదు.' అంటున్న డాక్టరు మాటలు వినిపించాయి.

'అన్నయ్యా' అంటూ రాముగదిగుమ్మంముందుకు పరిగెత్తుకొచ్చిన మీనానిచూసి, జమీందారుగారు అసహ్యంతో ఆమెపైకి హంటర్ విసిరారు. పాలుగారే

మీనా లేత చెక్కిలినుండి రక్త కారసాగింది. అయినా మీనా లెక్కచెయ్యకుండా పరుగెత్తుకెళ్ళి మంచంమీద రాముప్రక్కన కూర్చుని 'అన్నయ్యా, నేను నీ చెల్లి మీనాని నేను దేవుడిప్రసాదం తెచ్చాగా. ఇంక జ్వరం తగ్గిపోతుందిలే.' అంటూ తన చిన్ని చేతులతో ప్రసాదం తిని పించసాగింది.

'చెల్లీ,' అంటూ కళ్ళుతెరిచినరాము మీనా చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు.

'చూడండీ జమీంధారుగారూ, నేను మీ ఫామిలీ డాక్టర్‌గా కాక ఒకస్నేహితుడిగా చెపుతున్నాను. పవిత్రము, నిర్మలము అయినపసివారి ప్రేమకి అంతస్తులు అడ్డురావని ప్రేమ అనేది దైవప్రేరితమైనదని యిప్పటికైనా తెలుసుకోండి.' అంటూ డాక్టర్ రక్తం స్రవిస్తున్న, మీనాచెక్కిలికి చికిత్స చెయ్యసాగాడు.

పదిరోజులుగడిచాక ఖరీదైన సిల్కుగౌను తొడుక్కుని అద్దాలగుర్రపుబండిలో రాముతోపాటు బడికి వచ్చినమీనాని చూసి టీచర్లు, పిల్లలు ఆశ్చర్యంతో నోళ్ళుతెరిచారు.

'అన్నయ్యా, నువ్వంటే నాకువున్నంత యిష్టం రాము అంటే మీనాకిలేదు కదూ!' అంది చంద్రకిరణ్. మా చెల్లాయిచంద్రకిరణ్‌కి నేనంటే చెప్పలేనంతప్రేమ మాయిద్దరిమధ్య వున్న, ప్రేమానురాగాలు యితరులలో వుంటే సహించలేనివింత మనస్తత్వంగలది చంద్రకిరణ్ అందువల్ల చెల్లాయిప్రశ్నకు అవునని సమాధానమిచ్చాను.

'అన్నయ్యా,' అంటూ నిర్వచించలేని అనుబంధంతో చంద్రకిరణ్ నాహృదయానికి అతుక్కుపోయింది. మా అనుబంధం కలకాలం యిలాగే వుండిపోవాలని దేవునిప్రార్థిస్తూ చెల్లాయి అని వాత్సల్యంతో నిమురుతూ వుండిపోయాను.



మోడరన్ థియేటర్సువారి
'ఎవరు మొనగాడు' చిత్రంలో
రామ్మోహన్, రాజశ్రీ.